క్లుప్తంగా

కండలేరులో 6.602 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కంటే నోటాకే ఓట్లు ఎక్కువ

చిల్లకూరు : ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయకూడదని నిర్ణయించుకునే వారు నోటాకు ఓటు వేస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీ కాంగ్రెస్‌కు దాదాపు ఓటర్లు నోటాకు ఓట్లు వేసినట్లు తెలుస్తుంది. ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 3,276 ఓట్లు రాగా, ఎవరిపై నమ్మకం లేదని తెలియజేసేలా ఓటర్లు నోటాకు వేసిన ఓట్లు 3,119గా నమోదు అయ్యాయి. ఈ దఫా ఎన్నికల్లో ఓటర్లు విలక్షణమైన తీర్పును ఇవ్వడం విశేషం.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ


నేత్విక, అంకిత, దినేష్‌రెడ్డి

పెళ్లకూరు : జాతీయ ఉపకార వేతనం పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ఫలితాల్లో తాళ్వాయిపాడు, చెంబేడు, పాలచ్చూరు, నెలబల్లి పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. తాళ్వాయిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వంకపూరి నేత్విక, మేకల అంకిత, పాగల దినేష్‌రెడ్డి, చెంబేడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన లొక్కు గురుచరణ్, అంజూరు తేజశ్రీ, సమాధి తనూషా, పిన్నాబత్తిన వర్షిణి, పుట్టు గురువిష్ణు, పాలచ్చూరుకు చెందిన శ్రావ్య, నెలబల్లికి చెందిన హర్ష ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కర్ఫ్యూను తలపించిన ప్రధాన వీధులు


నాయుడుపేటలో నిత్యం జనాలతో రద్దీగా ఉండే బజారువీధిలో దుకాణాలు మూసి బోసిపోయి కనిపిస్తున్న వైనం

నాయుడుపేట టౌన్ : ఉత్కంఠగా మారిన ఓట్ల లెక్కింపు సందర్భంగా నాయుడుపేట పట్టణంలో ఎప్పుడూ జనాలతో కిటకిటలాడే ప్రధాన వీధులు సైతం కర్ఫ్యూను తలపించాయి. పట్టణంలోని బజారు వీధులు, దర్గావీధి, పాత బస్టాండు, మార్కెట్ వీధి, సీఎస్ తేజ సెంటర్ తదితర ప్రధాన కూడళ్లు సైతం దుకాణాలు మూసివేయడంతో గతంలో మాదిరి లాక్‌డౌన్‌ను తలపించాయి. జనాలు ఎక్కువగా ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఎన్నికల ఫలితాలపై దృష్టి సారించి ఆస్తకిగా తిలకించారు. ఎన్నికల ఫలితాల అనూహ్య పరిణామాలపై ఇళ్ల వద్దే చర్చించుకుంటున్నారు.

జూలైలో పరాశరేశ్వర బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: నారాయణవనంలో టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై నాలుగో తేదీ తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. జూలై మూడవ తేదీ బుధవారం సాయంత్రం అంకురార్పణ ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం7 గంటలకు వాహన సేవ ఉంటుందన్నారు. జూలై 13వ తేదీ ఉదయం త్రిశూల స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు పూర్తవుతాయని నాగరాజు పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాలకు 'చేయూత'


బ్యాంకు వద్ద క్యూ కట్టిన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: బ్యాంకు ఖాతాలకు జమ అయిన చేయూత నగదును మంగళవారం లబ్ధిదారులు అందుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన చేయూత పథకం నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద మహిళలు నగదు తీసుకునేందుకు బారులు తీరారు.

గంగమ్మ ఆలయ చైర్మన్ పదవికి కట్టా రాజీనామా

తిరుపతి కల్చరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ ఓటమి పాలవడంతో బాధ్యతగా వైఎస్ఆర్ సీపీ నేత కట్టా గోపియాదవ్ శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ పదవికి మంగళవారం సాయంత్రం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఈఓ కె.మమతకు ఆయన సమర్పించి, ఆమోదించాలని కోరారు.

చివరి వరకూ పోరాడిన వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్‌కుమార్
- వైఎస్సార్‌సీపీకి పోలైన ఓట్లు 80,929 టీడీపీకి వచ్చిన ఓట్లు 1,00844
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడతామన్న మేరిగ


నాయకులతో కలిసి డిక్లరేషన్‌ను చూపుతున్న పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో గూడూరు అసెంబ్లీ స్థానాన్ని టీడీపీ కైవశం చేసుకుంది. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ చివరి వరకు గట్టిగా పోరాడారు. ఆయనకు 80,929 పోలయ్యాయి. ఆయన ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌కు 1,00844 వచ్చాయి. గూడూరు నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు వివిధ పార్టీలకు చెందిన వారితో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేశారు. మేనెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో గూడూరు పట్టణం, రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 95,436 మంది పురుషులు, 98,016 మంది మహిళలు, ఇతరులు 13 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 193465 మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా 2,820 మంది ఓట్లు వేశారు. మంగళవారం చేపట్టిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌కు ఈవీఎంల ద్వారా 21,192, పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 1,831 ఓట్ల మెజార్టీ వచ్చింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌కు 554 ఓట్లు వచ్చాయి. వీటిలో రిజెక్ట్ అయిన ఓట్లు 372 ఉన్నాయి. టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌కు 1,00844 ఓట్లు వచ్చాయి, అలాగే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌కు 80,929 ఓట్లు వచ్చాయి. బీఎస్‌పీ తరఫున పోటీ చేసిన ఆనెం మల్లికార్జున్‌కు 1583 ఓట్లు, నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి ఉయ్యాల రామక్రిష్ణారావుకు 3,276 ఓట్లు పోలయ్యాయి. ఇండియన్ బిలీవర్స్ పార్టీ అభ్యర్థి కార్ల రమేష్‌బాబుకు 303 ఓట్లు వచ్చాయి. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి గొత్రిపాటి వెంకటేశ్వర్లుకు 178 ఓట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి దుర్గాటి పోలమ్మకు 225 ఓట్లు, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి దార్ల సునీల్‌రాజ్‌కు 139 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు తాటిపర్తి బాబుకు 232 ఓట్లు, పల్లి కోటేశ్వరరావుకు 200 ఓట్లు, బిక్కి వెంకటరమణయ్యకు 133 ఓట్లు, బొద్దు మురళీకి 180 ఓట్లు, యాలపల్లి శ్రీనివాసులుకు 266 ఓట్లు, వాదనాల వెంకయ్యకు 510 ఓట్లు వచ్చాయి. అలాగే నోటాకు 3,119 ఓట్లు పడ్డాయి. మొత్తం 1,92,117 పోల్ అయ్యాయి. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడతామని తెలిపారు.

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా

– ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



గూడూరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ గూడూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నాయకుడు వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రజలు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. వారికి నచ్చని అంశాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను త్వరలోనే సమీక్షించుకుంటామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, కార్యకర్తలు పోటీతత్వంగా తీసుకుని భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. గత 15 ఏళ్లుగా గూడూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోనే ఉంటూ కార్యకర్తలకు భరోసాగా నిలిచానన్నారు. ఇకపైనా అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యకర్తలు ఎలాంటి భావాద్వేగాలకు లోను కాకుండా సమన్వయం పాటించాలన్నారు. ఏది ఏమైనా ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని పేర్కొన్నారు. టీడీపీ గెలుపును స్వాగతిస్తూ ప్రజలకు చేరుగా ఉండి సంక్షేమంపై దృష్టి పెట్టాలని కోరారు.

అడుగడుగునా పోలీస్ బందోబస్తు


నాయుడుపేటలోని ప్రధాన వీధుల్లో పహరా కాస్తున్న పోలీసులు


వాహనాల్లో తిరుగుతూ పహరా కాస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్ : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నాయుడుపేటలో సోమవారం ఉదయం నుంచి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పలు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్‌లు పెట్టారు. పట్టణంలో నిత్యావసర సరుకులు విక్రయాలు జరిపే దుకాణాలు తప్ప అన్ని దుకాణాలను తెరవకుండా ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలో టీ దుకాణాలను సైతం మూయించి ఎక్కడా జనాలు నిలవకుండా పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మూడు మొబైల్ టీములతో పోలీసులు పహరా కాస్తు శాంతియుత వాతావారణం ఉండేలా చర్యలు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.


బందోబస్తులో ఉన్న పోలీసులు

పెంచలకోనలో భారీ వర్షం


పెంచలకోనలో కురుస్తున్న వర్షం

రాపూరు : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రజలు ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కలిగి గాలి, వాన, ఉరుములతో భారీ వర్షం కురిసింది. రాపూరు తదితర గ్రామాల్లో చల్లని గాలులు వీయడంతోపాటు చిరుజల్లులు కురిశాయి. వాతావరణ చల్లపడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

మృతి చెందిన వ్యక్తి నేత్రాలు సేకరణ


కొండయ్య(ఫైల్)

చిల్లకూరు : మృతిచెందిన వ్యక్తి నేత్రాలను కుటుంబ సభ్యుల సహకారంతో సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని మోడ్రన్ ఐ కేర్ ఆస్పత్రి వారు మంగళవారం సేకరించారు. గూడూరు పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన పేటేటి కొండయ్య (89) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సునీతా సేవా సంస్థ నిర్వాహకులు కొండయ్య కుటుంబ సభ్యులైన రమేష్‌ను సంప్రదించి నేత్ర దానం చేసేలా ఒప్పించారు. అటు తరువాత మోడ్రన్ ఐ కేర్ ఆస్పత్రి వారికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ మృతిచెందిన తరువాత మట్టిలో కలసిపోయే నేత్రాలను కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి దానం చేస్తే రెండు కళ్లు నలుగురికి ఉపయోగపడతాయన్నారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వారు 9440455947, 9490560404కు సమచారం ఇవ్వాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు


చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి ఆర్టీసీ పలు మార్గాల్లో అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రేణిగుంట-చంద్రగిరికి 10 సర్వీసులు, గ్రామీణ ప్రాంతాలకు 27 సర్వీసులు, 30 కొత్త హైర్ బస్సులు, అరుణాచలానికి ఒక ఏసీ సర్వీస్, మధురైకి మరో ఏసీ సర్వీస్ ఈ నెలలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో తిరుమలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరోవైపు అన్ని బస్టాండ్లలో తాగునీటి సౌకర్యాలతోపాటు దాతల సాయంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని నాలుగు జంబో కూలర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్‌ఓ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. బస్టాండ్లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మొత్తంగా వేసవిలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటా

- నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి


నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ముందుంటానని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం ఎన్నికల ఫలితాలపై స్పందించారు. వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ గెలుపొందడంపై అభినందలు తెలిపారు. అదే విధంగా సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం కృషిచేసిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎళ్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సురుటుపల్లెలో వైభవంగా ప్రదోష పూజలు


నందీశ్వరునికి విశేష హారతి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రదోష సమయంలో ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో నందీశ్వరుడికి, వాల్మీకేశ్వరుడికి ఏకకాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ ప్రదోష పూజల ఊత్తుకోట్టైకి చెందిన గణేశన్ ఉభదారుగా వ్యవహరించారు. ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వెంకటగిరి టీడీపీ కైవసం

- ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ గెలుపు
- టీడీపీకి 1,02,716, వైఎస్సార్‌సీపీకి 87,262 ఓట్లు



వెంకటగిరి రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన ఓట్ల లెక్కింపు ఫలితాల్లో వెంకటగిరి నియోజకవర్గాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. టీడీపీ నుంచి పోటీచేసిన కురుగొండ్ల రామకృష్ణకు 1,02,716 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి 87,262 ఓట్లు వచ్చాయి. ఇందులో 16,294 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించారు. వెంకటగిరి రిటర్నింగ్ అధికారి ధ్యానచంద్ర నియామక పత్రాన్ని అందజేశారు. కురుగొండ్ల రామకృష్ణ 2009, 2014లో రెండుసార్లు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల్లో విజయం సాధించారు.

ఎవరెవరికీ ఎన్ని ఓట్లు పోలయ్యాయంటే..

వెంకటగిరి నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ, టీడీపీ, ఇండిపెంటెంట్‌తో పాటు మొత్తం 10 మంది బరిలో నిలిచారు. ఇందులో టీడీపీ కురుగొండ్ల రామకృష్ణకు 1,02,716 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి 87,262 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పంట శ్రీనివాసులుకు 1,918 ఓట్లు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి పి.జయచంద్రకు 720, నీతినిజాయితీ పార్టీ అభ్యర్థి నాగరాజుకు 201, జై భారత్ నేషనల్ పార్టీకి చెందిన ఎం.శ్రీనివాసులుకు 107, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్)అభ్యర్థి ఎస్‌కే షఫీకి 223, భారతీయ చైతన్య యువజన పార్టీ అభ్యర్థి సిహెచ్ శివకృష్ణకు 186, ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్ముగంకు 161, ఇండిపెండెంట్ అభ్యర్థి వెంకటాచలపతికి 479, నోటాకు 3037 ఓట్లు వచ్చాయి. వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుకృషి చేస్తానని కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన అభివృద్ధి మేనిఫెస్టో అమలు, పేదల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని వెల్లడించారు.

కౌంటింగ్ వేళ బయటకురాని జనం


నిర్మానుష్యంగా ఉన్న ఆస్పత్రి రోడ్డు

గూడూరు రూరల్ : 2024 ఎన్నికల అనంతరం కౌంటింగ్ ఎప్పుడు జరుగుతుందోనని ఎదురు చూసిన ప్రజలు మంగళవారం ఎన్నికల కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. నిత్యం రద్దీగా ఉండే బజారు వీధి, ముత్యాలపేట రోడ్డు, ఆస్పత్రి రోడ్డు మంగళవారం ప్రజలు లేక నిర్మానుష్యంగా మారాయి. దీనికితోడు విజయావకాశాలు ఉండే పార్టీల నాయకులు, కార్యకర్తలు ముందుస్తుగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటే వివాదాలు ఏర్పడే అవకాశం ఉందని ముందుస్తుగా పోలీసులు ఎక్కడిక్కడ బందోబస్తును పటిష్టం చేశారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్, బజారు వీధి, సంగం థియేటర్, ఆస్పత్రి రోడ్డు, గాంధీబొమ్మ కూడలి, బనిగేసాహెబ్ పేట, ప్రముఖుల ఇళ్ల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. దీంతో కౌంటింగ్ రోజున గూడూరులో కర్ఫ్యూ విధించినంట్టు కనిపించింది.


టవర్ క్లాక్ సెంటర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మెల ధ్వంసం




శంఖంపల్లిలో వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం, ఆదినపల్లిలో తుడా నిధులతో వేసిన బెంచీలు ధ్వంసం

పాకాల: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు మంగళవారం గెలుపు సంబరాల్లో భాగంగా మండలంలోని శంఖంపల్లి, కె.వడ్డేపల్లిలో వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మెలను ధ్వంసం చేశారు. అలాగే ఆదినపల్లిలో తుడా నిధులతో ఏర్పాటు చేసిన బెంచీలను కూడా ధ్వంసం చేశారు.

గంగమ్మకు కరెన్సీ నోట్ల అలంకరణ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం


కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: కరుణించి కాపాడు... గంగమ్మ తల్లీ అంటూ భక్తజనం మంగళవారం సర్వాంగ సుందర అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను కోరి ప్రార్థించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి ప్రార్థించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మారు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన రెండో మంగళవారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టడం ఆరంభించారు. పొంగళ్లు నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. రెండో మంగళవారం కావడంతో ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ కరెన్సీ నోట్లు పుష్పాలతో గంగమ్మ తల్లిని ధనలక్ష్మీ రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి, కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు మంగళవారం చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తులు భక్తిశ్రద్ధలతో గంగవేషాలు ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఈఓ కె.మమత, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


గంగ జాతర వేషధారణలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు